క్లుప్తంగా

ఇల్లెందు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



కోరం కనకయ్యను సన్మానిస్తున్న ముస్లింలు

టేకులపల్లి: ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన కోరం కనకయ్యకు పలువురు అభినందనలు తెలియజేశారు. మంగళవారం కోయగూడెంలోని ఎమ్మెల్యే స్వగృహంలో పలువురు మర్యాదపూర్వకంగా కనకయ్యను కలిశారు. టేకులపల్లి బైతుల్లా మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు ఎండీ హనీఫ్, ఎండీ హాజీ, ఎంఏ సయీమ్, ఖాదర్ ఎమ్మెల్యేని కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. మోకాళ్ల శ్రీనివాస్‌రావు, కబ్బాకుల రవి, కుంజ కృష్ణ, చాపల రమేష్, భాస్కర్‌రావు, ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రెజ్లింగ్ సంఘం గౌరవ అధ్యక్షుడిగా సీతారాములు



సీతారాములును సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా నాగ సీతారాములు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పి.కాశీహుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలో మంగళవారం ఆయనను క్రీడా సంఘాల ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాశీంహుస్సేన్, కె.కృష్ణారావు, ఇ.మొగిలి, సదానందం, పి.నిహారిక తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులను ఆదుకోండి..



మట్టి తోలకాలను అడ్డుకుంటున్న సీతారామ భూ నిర్వాసితులు

జూలూరుపాడు: సీతారామ కెనాల్ కింద భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని భూ నిర్వాసితులు కోరుతున్నారు. మంగళవారం భోజ్యా తండా గ్రామ పంచాయతీకి చెందిన సీతారామ భూ నిర్వాసితులు కాల్వ మట్టి తోలకాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితుతు మాట్లాడుతూ.. సీతారామ కాల్వ నిర్మాణం కారణంగా పంటలు సాగు చేసుకుంటున్న పోడు భూములు కోల్పోయామన్నారు. మా పోడు భూములకు పట్టాలేకపోవడంతో ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు లేకపోయినా నష్టపరిహారం ఇస్తామని ఆ నాటి కలెక్టర్ చెప్పారన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని వాపోయారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, అటవీశాఖ అధికారులు కూడా సందర్శించినా ఇప్పటి వరకు పరిహారం రాలేదని పేర్కొన్నారు. సీతారామ కాల్వ తవ్వకుండా ఉంటే మా భూముల్లో పంటలు సాగు చేసుకునే వాళ్లమని ఆవేదన వ్యక్తం చేశారు. మా సమస్య పరిష్కరించే వరకు కాల్వ నిర్మాణ పనులు గానీ, మట్టి తోలకాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. భూ నిర్వాసితులు బానోత్ శంకర్, బాదావత్ రవి, ధరావత్ రాజెల్లా, జ్యోతీబాస్, బానోత్ చిలికి, బోడా భోజ్యా, ధరంసోత్ సక్రు, గుగులోత్ బిచ్యా, తాళ్లూరి చిన్న వీరయ్య, మొగలాలీ, పెద్ద వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోండి..

- మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటోలకు తగ్గిన గిరాకీ
- ఆందోళన బాట పట్టిన డ్రైవర్లు
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



ఆందోళన చేస్తున్న ఆటో, కార్ ట్యాక్సీ డ్రైవర్లు

ఇల్లెందు: ప్రభుత్వం ఆరు గ్యారంటీ స్కీంల అమలులో భాగంగా ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టింది. దీంతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని, వారిని అదుకోవాలని ఆటో డ్రైవర్ల కార్మిక జేఏసీ డిమాండ్ చేసింది. మంగళవారం ఇల్లెందులో ఆటో డ్రైవర్ల కార్మిక సంఘం జేఏసీ నేతలు ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల జేఏసీ నేతలు ఎస్‌బి నబీ, యాకుబ్‌షావలీలు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీ స్కీంల వల్ల ఆటో, టాటా మ్యాజిక్, జీపు, కారు డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ప్రతీ నెల ఒక్కొక్కరు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఈఎంఐలు కట్టాల్సి ఉందన్నారు. దీనితో పాటు కుటుంబ పోషణ, రోడ్ ట్యాక్స్, బీమా తదితర చెల్లింపులు ఉంటాయని తెలిపారు. డ్రైవర్లు ఉపాధి ఉద్యోగ మార్గాలు లేక డ్రైవింగ్ మార్గం ఎంచుకున్నారని తెలిపారు. మహాలక్ష్మి పథకం వల్ల వీరంతా రోడ్డున పడ్డారని తెలిపారు. ప్రభుత్వం ఆటోలు, జీపులు, మ్యాజిక్‌లు ఇతర వాహనాల వల్ల ప్రజా రవాణా రంగం మీద ఆధారపడి జీవిస్తున్న వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, శేఖర్, తోట శివ, రాంబాబు, రామకృష్ణ, నరేష్, సుదర్శన్, రాము, సీతారాములు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డ్రైవర్లు

విద్య, వైద్యం, క్లబ్‌లు నిర్వీర్యం



మాట్లాడుతున్న మాధవ నాయక్

సింగరేణి(కొత్తగూడెం): గతంలో గుర్తింపు సంఘంగా ఎన్నికైన పాలకులు సింగరేణిలో విద్య, వైద్యాన్ని నిర్వీర్యం చేయటమే కాకుండా సీఈఆర్ క్లబ్‌ను నిర్వీర్యం చేశారని ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ ఆరోపించారు. మంగళవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సింగరేణి పాఠశాలలో అడ్మిషన్ కోసం పెద్దపెద్ద పైరవీలు ఉంటేనే లభించేది. అటువంటి పాఠశాలల్లో కార్మికుల పిల్లలు, ఉద్యోగుల పిల్లలు చదవకుండా రూ.లక్షల డోనేషన్లు కట్టి ప్రవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నట్లు చెప్పారు. సింగరేణి ఆస్పత్రిలో చికిత్స దయనీయమైంది. పైరవీలు ఉంటేనే కార్పొరేట్ చికిత్స అని వాపోయారు. కార్మిలను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. సీపీఆర్ఎంఎస్ కార్డు ఉన్నవారికి వైద్యం అంతంత మాత్రమే. సీపీఆర్ఎంఎస్ ఉన్న కార్మికులకు లోకల్ ఆస్పత్రిలో వైద్యం తీసుకుంటే వారిలో ఎమైంట్ కట్ చేస్తున్నారు. సంస్థ అభివృద్ధికి పనిచేసిన కార్మికులకు వైద్యం అందించడంలో గత పాలకులు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. బీఎంఎస్ కాగడా గుర్తుపై ఓటేస్తే కార్మికులకు ఉచిత వైద్యంతోపాటు, పిల్లలకు కేంద్రీయ విద్య, క్లబ్‌ల్లో ఫ్యామిలీ డేలు రెగ్యులర్‌గా జరిపిస్తామన్నారు. ఏరియా ఉపాధ్యక్షులు మొగిలిపాక రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీఎస్ పవన్‌కుమార్, సంగం చందర్, సుందర్‌రావు, ఉదయ్ కుమార్, భీమా, అల్లి ప్రకాశ్, సిలుగోరి శ్రీను, నరసింహారావు, అబిద్, కుమారస్వామి పాల్గొన్నారు.

నేడు హోమగుండం

టేకులపల్లి: మండలంలోని కొత్తతండా(పి) గ్రామంలో బుధవారం రాత్రి అయ్యప్పల హోమగుండం, నగర సంకీర్తన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలు గురుస్వామి, అయ్యప్ప భక్త బృందం, ఆంజనేయ భక్త బృందం ఆధ్వర్యంలో మహాపడిపూజ, హోమగుండం, నగరసంకీర్తనకు అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఇంక్రిమెంట్లు ఇప్పించండి..

ఇల్లెందు: ఓ చిన్న నేరానికి ఐదు ఇంక్రిమెంట్ల కోత విధించి తీవ్ర మానసిక వేదనకు గురి చేశారని, ఇంక్రిమెంట్ల కోత, గ్రాట్యూటీ, పెన్షన్ నష్టపోయిన తనను ఆదుకోవాలని మాజీ సింగరేణి ఉద్యోగి రాజేశ్వరరావు సంస్థను వేడుకుంటున్నారు. ఇల్లెందు ఏరియా వర్క్ షాపులో సబ్ స్టేషన్ అటెండర్‌గా పని చేసిన అనుమోలు రాజేశ్వరరావు 2016లో ఉద్యోగ విరమణ చేశారు. అదే సంవత్సరంలో జరిగిన ఓ సంఘటనకు బాధ్యుడిని చేస్తూ ఐదు ఇంక్రిమెంట్ల కోత విధించారు. ఆనాటి నుంచి నేటి వరకు ఆఫీసుల చుట్టూ తిరిగి తీవ్రంగా నష్టపోయినట్లు రాజేశ్వరరావు మంగళవారం మీడియాకు తన గోడు వెళ్లబోసుకున్నాడు. సింగరేణి అధికారులు పునఃపరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

అన్నదానం..



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ

కొత్తగూడెంఅర్బన్: సమాజంలో మేలు కోసం కొత్తగూడెంలోని అన్ని రకాల వ్యాపారులు కలిసి అన్నదానం చేయడం అభినందనీయమని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. మంగళవారం అమావాస్య నేపథ్యంలో వ్యాపార వర్గాలవారు అందరూ కలిసి బస్టాండ్ సెంటర్‌లో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ ప్రారంభించి అనంతరం మాట్లాడారు. అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం జరిపితే మంచి జరుగుతుందని, పెద్దల ఆశీర్వాదం లభిస్తుందనే ఉద్దేశ్యంతో ప్రతినెల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యాపారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాపార సంఘం నాయకులు తాటిపల్లి శంకర్‌బాబు, కంభంపాటి రమేష్, మొరిశెట్టి భవానిప్రసాద్, గునిపాటి ఆనంద్, పాండురంగారావు, అబిద్, కొదుమూరి శ్రీనివాసరావు, నరేంద్రుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలకు నగదు వితరణ



నగదు అందజేస్తున్న చిన్నారులు

సింగరేణి(కొత్తగూడెం): స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో అంధుల కోసం ప్రత్యేక పాఠశాల, కళాశాలను ఏర్పాటు చేసి, వారికి విద్య, భోజన వసతి కల్పిస్తున్నారు. ఈ మేరకు వీరు సెయింట్ జోసఫ్ పాఠశాలను సహాయం కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన పాఠశాల విద్యార్థులు, సిబ్బంది రూ.రెండు లక్షలను మంగళవారం ప్రిన్సిపాల్ స్నేహ అంధుల సొసైటీకి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... తోటి వారికి సహాయం చేయాలని 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు వారి తల్లిదండ్రులను అడిగి తీసుకొచ్చి ఆయా క్లాస్ రూమ్ టీచర్లకు అందజేశారన్నారు. విద్యార్థులు అంధులకు సహాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ జార్జిరెడ్డి, బ్రదర్ అభిలాష్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



పాల్వంచ: ఏడీ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు



జూలూరుపాడు: తహసీల్దార్ శారదకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాపంథా నాయకులు

పాల్వంచ: తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా నాయకుడు నిమ్మల రాంబాబు అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ... తుపాన్ వల్ల నష్టపోయిన వరి, మొక్కజొన్న రైతులకు రూ.40వేలు, పత్తి పంటకు రూ.50వేలు, మిర్చి రూ.1లక్ష చొప్పున నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కౌలు రైతులు, సీలింగ్, బంజర, పోడు భూములు సాగు చేస్తూ నష్టపోయిన రైతులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పూనెం రమేశ్, రాయబారపు వెంకటేశ్వర్లు, రాంశ్రీను, తాటి రమేశ్, సురేశ్, అజయ్, మనోజ్, గణేశ్, గంగరాజు, రాధ, వెంకటరమణ, మల్లమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మిచాంగ్ తుపాను వలన నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని బీఎస్పీ మండల కార్యదర్శి కాళ్ల రంజిత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దెబ్బతిన్న పంటలను పరిశీలించి, బాధిత రైతులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతాంగం సాగు చేసిన మిర్చి, వరి, పత్తి పంటలు నీట మునిగి తీరని నష్టాన్ని మిగిల్చాయని, మిర్చి తోటలు మట్టిలో కూరుకపోయాయని, కోతకు వచ్చిన వరి తడిసి మొలకెత్తుతున్నాయన్నారు. ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని గ్రామాలలో పంట నష్టం సర్వేలకు పంపించాలని డిమాండ్‌చేశారు. పంట నష్టం అంచనా వేసి మిర్చి పంటకు ఎకరాకు రూ.లక్ష, వరి పంటకు రూ.25వేలు, పత్తి పంటకు ఎకరాకు రూ.30 వేలు, మొక్కజొన్న రూ.25వేల చొప్పున నష్టపరిహారాన్ని ప్రకటించాలని కోరారు.

జూలూరుపాడు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ శారదకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ, మండల కార్యదర్శి బానోత్ ధర్మా మాట్లాడారు. తుపాన్ కారణంగా మండలంలో వరి, పత్తి, మిరప, మొక్కజొన్న, కూరగాయ పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు చెప్పారు. పత్తి పంటకు ఎకరానికి రూ.50వేలు, మిర్చి రూ.1 లక్ష, మొక్కజొన్న, కూరగాయలకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో వై.గోపాల్‌రావు, పారుపల్లి బాబూరావు, ఎం.కృష్ణయ్య, లింగాల వీరభద్రం, రాయల సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె ప్రారంభం



టేకులపల్లి: పోస్టాఫీసు ఎదుట సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు



పాల్వంచ: సమ్మెలో పాల్గొన్న సిబ్బంది

టేకులపల్లి: పోస్టాఫీసులలో పని చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ), నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ (ఎన్‌యూ జీడీఎస్)ల సంయుక్త ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఆందోళనలో భాగంగా మంగళవారం టేకులపల్లి పోస్టాఫీసు వద్ద మండల తపాలా ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌యూజీడీఎస్ తెలంగాణ సర్కిల్ ఉపాధ్యక్షుడు ఆర్.శ్రీరాములు మాట్లాడుతూ... డిమాండ్ల సాధన కోసం ఈనెల 5 నుంచే దశల వారీగా ఆందోళనలు చేపడుతున్నామని, ఇందులో భాగంగానే నిరవధిక సమ్మెలోకి వెళ్లామని తెలిపారు. 8 గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని, 2016 నుంచి టీఆర్‌సీఏ రేషనల్ ఫిక్సేషన్‌తో సహా కమలేష్ చంద్ర కమిటీ సానుకూల సిఫార్సులు అన్నింటినీ వెంటనే అమలు చేయాలని, రెగ్యులర్ ఎంప్లాయిస్ ఇచ్చినట్లు వెయిటేజీ, ఇంక్రిమెంట్, సీనియర్స్/బంచింగ్ ఇవ్వాలని, 12, 24, 36 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారికి ఆర్థిక ఉన్నతి కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ కవరేజీ రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. డిపార్టుమెంట్ స్టాఫ్‌తో సమానంగా జీడీఎస్, గ్రాట్యుటీ పెంచాలని, పెయిడ్ లీవ్‌లను 180 రోజుల వరకు దాచుకుని నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలని విన్నవించారు.

అదేవిధంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, బిజినెస్ టార్గెట్ల పేరుతో జీడీఎస్‌లను వేధించే అన్ని పద్ధతులను నిలిపివేయాలని, జీడీఎస్‌ల ఇష్టానికి వ్యతిరేకంగా సొంత మొబైల్ ఫోన్లు వినియోగించాలని ఒత్తిడి చేయడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.జానకీరామ్, ఎంఏ హాసిం, జి.శ్రీను, ఎం.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని భద్రాచలం బ్రాంచ్ సెక్రటరీ బండి ఎల్లారావు అన్నారు. తపాలా ఉద్యోగులు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా స్థానిక పోస్టాఫీస్ ఎదుట ఏఐజీడీఎస్‌యూ, ఎన్‌యూజీడీఎస్, పీజేసీఏల యూనియన్ల ఆధ్వర్యంలో మంగళవారం నిరవధిక సమ్మెను చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్లారావు మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పనిని అమల్లోకి తేవాలని, పెన్షన్‌తో పాటు అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలన్నారు. రెగ్యులర్ ఎంప్లాయిస్ ఇచ్చిన వెయిటేజీ, ఇంక్రిమెంట్లు పెంచడంతో పాటు జీడీఎస్‌లకు గ్రాట్యూటీ పెంచి ఇవ్వాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్‌ను రూ.5లక్షలకు పెంచాలన్నారు. ఇన్సెంటివ్ కమీషన్ పద్ధతి కాకుండా ప్రతీ పనిని వర్క్‌లోడ్‌లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ పాలాది చంద్రశేఖర్, నక్క శ్రీను, సిద్ధయ్య, శేఖర్, మంజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు



రాందాస్ నాయక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులు



ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలుసుకున్న గిరిజన నాయకులు

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను మంగళవారం కొత్తగూడెంలోని ఆయన నివాసంలో జూలూరుపాడు మండలాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను అధికారులు, పంచాయతీ కార్యదర్శులు శాలువా కప్పి సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జూలూరుపాడు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ తులసీరామ్, పంచాయతీ కార్యదర్శులు పి.కృష్ణ, లక్ష్మి, జ్యోతి, విజయలక్ష్మి, సుమ, షర్మిల, ఎస్కే ఇస్మాయిల్, భూక్యా నానిబాబు, చరిత్ రాజ్, అశోక్, తిరుపతిరావు, శ్రీనివాసరావు, వెంకట్, ప్రభాకర్, రాంప్రసాద్ ఉన్నారు.

కొత్తగూడెంటౌన్: గిరిజన సంఘాల నాయకులు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌ను మంగళవారం కొత్తగూడెంలోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు.

కొత్తగూడెం గొల్లగూడెంలోని ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన గిరిజన నాయకులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు ఆధిల్, ఎల్‌ఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగీలాల్ నాయక్, కాన్షిరాంనాయక్, మాలోతు కోటి, చంటి, కుమార్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభివృద్ధికి సహకరించండి



ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సన్మానిస్తున్న టీవీపీఎస్ సంఘం సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: అసెంబ్లీ ఎన్నికలలో కొత్తగూడెం ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించిన సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని సాంబశివరావును మంగళవారం ఆయన స్వగృహంలో తెలంగాణ విభిన్న ప్రతిభవంతుల సంఘం (టీవీపీఎస్) సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, వీజేఏసీ చైర్మన్ సతీష్ గుండపునేని మాట్లాడుతూ... కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని నియోజకవర్గ అభివృద్ధికి, దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేయాలని అభ్యర్థించారు. నియోజకవర్గంలో సుమారు ఐదువేల మంది దివ్యాంగులు ఉన్నారని వారికి అన్ని సంక్షేమ పథకాలలో ఐదు శాతం అమలు అమలయ్యేలా చూడాలని, మున్సిపల్, జెడ్పీ నిధుల్లో ఐదు శాతం నిధులను వారి అభ్యున్నతికే ఖర్చు చేయాలని కోరారు. అదేవిధంగా నియోజవర్గ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా బైపాస్ రోడ్డు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని విన్నవించారు. కార్యక్రమంలో దివ్యాంగ ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షులు మాలోతు జగ్గ దాస్, వీజేఏసీ జిల్లా కన్వీనర్ నాగేశ్వరరావు, సున్నం కరుణాకర్, గట్ల రమేష్, కళాబాబురెడ్డి, చాంద్ పాషా, సాయి బాబా, రాంబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత



హాజరైన ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు

జూలూరుపాడు: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుకృత అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అదేవిధంగా గర్భిణుల ప్రసవాలపై ఆరా తీశారు. అనంతరం ఆశా డే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఆస్పత్రికి తెలియ పరచాలన్నారు. మాతాశిశు మరణాల రేటు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రసవాలు, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, క్షయ, విజజ్వరాలు, షుగురు, బీపీ, హెచ్‌ఐవీ, వ్యాధుల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయి సిబ్బందికి డాక్టర్లు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్, డాక్టర్ తేజశ్వని, డీపీహెచ్ఎన్ అన్నామేరీ, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, హెచ్ఎస్ రత్నకుమార్, హెచ్‌వీలు సుభద్రమ్మ, రాధిక, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్‌ఎంలు రాజమ్మ, తార, మంగమ్మ, ఝాన్సీరాణి, ఆదిలక్ష్మి, వెంకటముత్యం, రీనా, రాణి, సావిత్రి, సుజాత, పార్వతి, సుశీల, అనూష, నాగలక్ష్మి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వనమా రాఘవపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న అనంతరాములు

పాల్వంచ: సర్వే నంబర్ 817లో శ్రీదేవి అనే మహిళకు చెందిన 3 ఎకరాల భూమిని మాజీ ఎమ్మెల్యే తనయుడు వనమా రాఘవేందర్‌రావు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా యత్నం చేస్తున్నారని టీడీపీ జిల్లా నాయకుడు కనగాల అనంతరాములు ఆరోపించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్టర్స్ కాలనీలో సర్వే 817లో పేలేజి శ్రీదేవికి మూడు ఎకరాల స్థలం ఉందని, దీనిని 817/ఔ నంబర్ సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆక్రమించాడని ఆరోపించారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, మంత్రులను కలుస్తామని, న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో శ్రీదేవి, నరేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.


సింగరేణి సీఎండీపై ఫిర్యాదు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్‌పై కొత్తగూడేనికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఆకునూరి కనకరాజు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. 10 సంవత్సరాలుగా సింగరేణి సీఎండీగా ఉంటూ బీఆర్‌ఎస్‌కు ప్రతినిధిలా వ్యవహరించారని, బీఆర్‌ఎస్ ఎంపీలు, నాయకులకు సింగరేణికి చెందిన భూములు, భవనాలు, క్వార్టర్లను కేటాయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బెల్లంపల్లి, చెన్నూరు, పినపాక ఎమ్మెల్యేలకు పలు క్వార్టర్లు, భూములు కేటాయించారని, కొత్తగూడెం ఏరియాలో టీబీజీకేఎస్‌కు చెందిన నాయకులు సుమారు 60, 70 క్వార్టర్లు ఆక్రమించుకొన్న విషయం తెలిసినా సింగరేణి అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. ఈ విషయాలపై సమగ్ర విచారణ జరిపి సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజలు సన్మార్గంలో నడవాలి..



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు



హాజరైన సుంకరగూడెం గ్రామస్తులు

ఇల్లెందురూరల్: మామిడిగూడెం గ్రామపంచాయతీ సుంకరగూడెం పాలు దేవాలయం (చర్చి) 48వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఉదయమే చర్చికి చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మధ్యాహ్నం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన చర్చిల పాస్టర్లు వార్షికోత్సవ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు మాట్లాడుతూ.. 48 ఏళ్ల క్రితం స్థానికులు స్వయంగా నిర్మించుకున్న చర్చికి నాటి నుంచి గ్రామంలోని ప్రభుత్వ ఉద్యోగులు సంఘంగా ఏర్పడి ప్రతిఏటా వార్షికోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మంచిని ప్రేమించి మానవత్వాన్ని ప్రదర్శించడం భక్తికి నిదర్శనంగా పేర్కొన్నారు. ప్రభువైన యేసు సూక్తులను ప్రజలకు వివరించి వారు సన్మార్గంలో నడిచేలా చూడాల్సిన బాధ్యత కూడా గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామపెద్దలపై ఉందన్నారు. కార్యక్రమంలో సామ్యూల్ దినకరయ్య, ఫ్రాంక్లిన్, జార్జి క్లైమేట్, చార్లెస్ సురేందర్, శ్యాంసుందర్, జాషువా, దయానంద, జాషువా, ఉపసర్పంచ్ ప్రసూన, స్వామిదాసు, దాస్ ఇమ్మానియేలు, యేసు రత్నం, పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.